మూడో వారంలో కొనుగోలు కేంద్రాలు



- పాలమూరులో 28 చోట్ల ఏర్పాటుకు చర్యలు
- క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర



సీసీఐ డీజీఎం మహేశ్వర్‌రెడ్డితో ముఖాముఖి

ఈనాడు, మహబూబ్‌నగర్: భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించే రైతులు ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాను తీసుకు రావాలని సీసీఐ మహబూబ్‌నగర్ శాఖ డీజీఎం మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈసారి పత్తి క్వింటాకు రూ. 7,521 మద్దతు ధరను సంస్థ ప్రకటించిందని చెప్పారు. పాలమూరులో మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల మూడోవారంలో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిన్నింగ్ మిల్లులు, రవాణాకు సంబంధించిన టెండరు ప్రక్రియ కూడా పూర్తి కావొచ్చిందన్నారు. ఉమ్మడి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై డీజీఎంతో 'ఈనాడు' ముఖాముఖీలో వెల్లడించిన అంశాలిలా ఉన్నాయి.

? పత్తికి మద్దతు ధర ఎలా ఉంది? వర్షానికి పంట దిగుబడి, తేమ శాతంపై ప్రభావం పడింది? రైతుల పరిస్థితి ఏమిటి?

✔ పత్తికి సీసీఐ మద్దతు ధర రూ. 7,521గా నిర్ణయించింది. తేమ శాతం 8-12 మధ్యలో ఉండేలా చూసుకోవాలి. తేమ 8 శాతం ఉంటే పూర్తి మద్దతు ధర ఉంటుంది. తేమ శాతంలో తేడా ఉంటే ధరలో స్వల్ప మార్పు ఉంటాయి.

? ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు ఎంత? దిగుబడి ఎంత వస్తుందని అంచనా వేస్తున్నారు?

✔ ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,43,237 హెక్టార్లలో పత్తి సాగు చేశారు. సుమారు 30 లక్షల క్వింటాళ్ల పత్తి వస్తుందని అంచనా వేస్తున్నాం. వీటి ద్వారా 6.08 లక్షల బేళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది.

? రెండేళ్లుగా రైతులు ప్రైవేటు మార్కెట్‌ను ఆశ్రయిస్తూ నష్టపోతున్నారు? సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు? ఈసారి అదే పరిస్థితి ఎదురయ్యే అవకాశాలున్నాయా?


✔ గత రెండేళ్ల ప్రైవేటు మార్కెట్‌లో క్వింటాకు సీసీఐ మద్దతు ధర కంటే అధికంగా రేటు పలికింది. చాలా మంది రైతులు ప్రైవేటు మార్కెట్‌కు వెళ్లారు. తర్వాత విపణిలో పత్తికి డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గుతూ వచ్చాయి. ఈసారి సీసీఐ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాయి.

? సీసీఐ ద్వారా విక్రయిస్తే రైతులకు డబ్బులు రావడానికి ఆలస్యమవుతుందని అంటున్నారు?

✔ సీసీఐ ద్వారా పత్తి విక్రయించే రైతులకు వారంలోగా డబ్బు ఖాతాలో జమవుతాయి. ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న బ్యాంకు ఖాతాను మాత్రమే రైతు తీసుకురావాలి. కేవైసీ చేసుకోకుంటే డబ్బు రావడంలో సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. కేంద్రాలకొచ్చే సమయంలో రైతు తన ఆధార్‌కార్డు తీసుకురావాలి. రైతు రాలేని పరిస్థితి ఉంటే కుటుంబ సభ్యుడిని పంపించవచ్చు. దీనికి సంబంధించిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఇతర ధ్రువపత్రం తీసుకురావాలి.

? పత్తి కొనుగోలు కేంద్రాలెక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు?

✔ పాలమూరులో మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. మహబూబ్‌నగర్-2, నాగర్‌కర్నూల్-18, నారాయణపేట-8, వనపర్తి-1, జోగులాంబ గద్వాలలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. టెండర్లలో పాల్గొన్న జిన్నింగ్ మిల్లులను త్వరలోనే నోటిఫై చేస్తాం. రవాణా కోసం వాహనాల టెండర్ల ప్రక్రియ త్వరలోనే పూర్తికానుంది.



ఉమ్మడి జిల్లాలో పత్తి పంట సాగు వివరాలు ఇలా(హెక్టార్లలో)..

తితిదే ఆధ్వర్యంలో గీతాకంఠస్థ పోటీలు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : డిసెంబరు 11న గీతా జయంతిని పురస్కరించుకుని భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు తితిదే అధికారి డా. ఉత్తరపల్లి రామాచారి వెల్లడించారు. భగవద్గీతలోని 6వ అధ్యాయంలో శ్లోకాలు పఠించాల్సి ఉంటుందన్నారు. 6, 7, అలాగే 8, 9 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గీతలోని 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలు వచ్చిన 18 ఏళ్ల పైబడిన వారికి కూడా వేరుగా పోటీలుంటాయన్నారు. జిల్లాస్థాయి పోటీలను డిసెంబరు 1న మరికల్‌లోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. వివరాలకు 93475 40005, 73967 11574 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆత్రం ఎక్కువ.. ఆలోచన తక్కువ

పత్తి పంట చేతికొచ్చింది.. అధికారులు వచ్చేనెలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తారట. వరి ధాన్యం రావడానికి ఇంకా నెలరోజులు పడుతుంది. అప్పుడే కేంద్రాలు ఏర్పాటు చేశారు. దిగుబడి రాని వరి కోసం సమీక్షలపై సమీక్షలు నిర్వహించి ఆత్రంతో ఏర్పాటు చేశారు. పత్తిరైతులు లబోదిబోమంటున్నారు

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో యంత్రాంగం వైచిత్రి

న్యూస్‌టుడే– నారాయణపేట న్యూటౌన్

జిల్లాలో 1,61,150 ఎకరాల్లో పత్తి పంట వేశారు. 9,90,900 క్వింటాళ్ల పత్తిని సేకరించాలని నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ. 7521 మద్దతు ధర ప్రకటించింది. సీసీఐ ద్వారా నారాయణపేట, మక్తల్ మార్కెట్లలో కొనుగోలు చేపడతామని అధికారులు అంటున్నారు. అదనంగా మక్తల్, నారాయణపేటల్లో ఏడు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని చెబుతున్నారు. ప్రైవేటులో పత్తికి ఎక్కువ ధర వస్తే జిన్నింగ్ మిల్లుల్లోనూ విక్రయాలు పెద్ద సంఖ్యలో ఉంటాయని అంటున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా కేంద్రాలను వచ్చే నెల రెండో వారంలో ప్రారంభిస్తామని చెప్పడం రైతులను విస్మయపరుస్తోంది. పక్షం రోజుల నుంచే జిల్లాలో పత్తి విక్రయాలు మొదలయ్యాయి. సీసీఐ కేంద్రాలను ప్రారంభించనందున రైతులు ప్రైవేటు మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ వారు చెప్పిందే నాణ్యత, ఇచ్చిందే ధర అన్నట్లుగా సాగుతోంది. నాణ్యమైన పత్తి రూ. 7వేలు దాటడంలేదు. ● జిల్లాలో వరి పంట చేతికి రావాలంటే ఇంకా నెల రోజులైనా పడుతుంది. ఇంకా చాలా సమయం ఉన్నా హడావుడిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గత శుక్రవారం కొల్లంపల్లిలో ఐకేపీ ద్వారా కేంద్రం ఏర్పాటుతో శ్రీకారం చుట్టారు.



గతనెలలో కొల్లంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు (పాతచిత్రం)

పత్తి రైతులకు కోలుకోలేని దెబ్బ

ఈ ఏడాది జిల్లాలోని పత్తి రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అతి వర్షాలతో కొన్ని రోజుల పాటు పంట నీటి మునిగింది. పూత రాలి దిగుబడి గణనీయంగా పడిపోయింది. పలు చోట్ల మొలకెత్తింది. పెట్టుబడి వస్తే చాలని రైతులు భావిస్తున్న తరుణంలో కొనుగోలు చేసే చోట మరింత దగాకు గురవుతున్నారు. ఇకనైనా క్షేత్రస్థాయిలోని వాస్తవాలను గుర్తించాలి.



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికరెడ్డి

అందరూ ఆడాలి: ఎమ్మెల్యే

ధన్వాడ, న్యూస్‌టుడే : క్రీడల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. ఆదివారం ఆప్పాజీ మైదానంలో డీపీఎల్(ధన్వాడ ప్రీమియర్ లీగ్) రెండో సీజన్ క్రికెట్ పోటీలు ప్రాంభమయ్యాయి. ఇందులో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ గెలుపోటములను పక్కకు పెట్టి ప్రతి ఒక్కరూ ఆటపోటీల్లో పాల్గొనాలన్నారు. బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులు, అభిమానులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎమ్మెల్యే పీఏ చిట్టెం మాధవరెడ్డి స్థానిక అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

సీసీ వేశారు.. మట్టి మరిచారు..

బొందల్‌కుంట స్టేజీ నుంచి గ్రామంలోకి సీసీ రహదారి వేశారు. ఇరువైపులా మట్టి వేయకపోవడంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత గుత్తేదారు చొరవ తీసుకొని వెంటనే రహదారికి ఇరువైపులా మట్టి వేయాలని కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ మారుతిని వివరణ కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడి మట్టి వేయిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం





శాకంబరిగా జములమ్మ

శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గద్వాల పురపరిధిలోని జమ్మిచేడు జములమ్మ అమ్మవారు నాలుగో రోజైన ఆదివారం భక్తులకు శాఖంబరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం

ఉపాధ్యాయ ఖాళీలు మిగలకుండా ఏర్పాట్లు

మొదట ఎస్‌ఏల భర్తీ ● త్వరలో పాఠశాలలకు కొత్త టీచర్లు



ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. ఈ నెల 1 నుంచి 5 వరకు ధ్రువపత్రాలను పరిశీలన చేయాల్సి ఉండగా మొదటి రోజు సాంకేతిక కారణాలతో ప్రారంభం కాలేదు. మిగిలిన నాలుగు రోజుల్లో ఒక్కో పోస్టుకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసే సమయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. జాగ్రత్తలు తీసుకోకుండా ఖాళీలను భర్తీ చేస్తే మళ్లీ అధిక సంఖ్యలో మిగిలిపోయే అవకాశం ఉంది. ఉపాధ్యాయ పదోన్నతుల సమయంలో ఈ పరిస్థితి ఏర్పడింది. కొందరు అభ్యర్థులు రెండు, మూడు సబ్జెక్టుల్లో అదనపు అర్హతలు సాధించడంతో వారు ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ఎంపికైన వారు వారికి ఆసక్తి ఉన్న ఏదో ఒక పోస్టును ఎన్నుకోవడంతో ఖాళీల ఇబ్బంది ఏర్పడింది. దీంతో మొదటి ఎస్ఏ ఖాళీలకు 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల తుది జాబితాను రూపొందించి ఏ పోస్టును ఎంపిక చేసుకుంటారన్న విషయంలో ముందుగా డిక్లరేషన్ తీసుకున్నారు. ఎస్ఏ ఖాళీలను భర్తీ చేసిన తరువాత ఎస్‌జీటీలో వారు అర్హత సాధిస్తే అవి ఖాళీలుగా మిగిలి పోనున్నాయి. ఆ పోస్టుల్లో తదుపరి ర్యాంకు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి అన్ని ఖాళీలు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో జిల్లాలో 10 నుంచి 25 మంది అభ్యర్థులు రెండు, మూడు ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు.

జిల్లా	ఖాళీలు	దరఖాస్తుల పరిశీలన		
		అభ్యర్థులు	హాజరు	గైర్హాజరు
గద్వాల	172	416	387	29
మహబూబ్‌నగర్	243	576	552	24
నాగర్‌కర్నూలు	231	617	575	42
నారాయణపేట	279	664	585	79
వనపర్తి	152	363	341	22

2,440 మంది ధ్రువపత్రాలు పరిశీలన : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఉమ్మడి జిల్లాలో 2,440 మంది హాజరయ్యారు. మొత్తం 1,077 ఖాళీల భర్తీకి 2,636 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా 196 మంది గైర్హాజరయ్యారు. ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేటర్లు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో దానికి సంబంధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టలేదు. కోర్టు నిర్ణయం తరువాత ఈ పోస్టుల విషయంలో చర్యలు తీసుకోనున్నారు. ఖాళీల భర్తీతో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

తుది జాబితాల తయారీపై దృష్టి..: ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కావడంతో తుది జాబితా రూపొందించడంపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పాటు వారికి సమాచారం అందజేయనున్నారు. ఎంపికైన వారికి 9న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తి చేశామని త్వరలో తుది జాబితాలను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నాగర్‌కర్నూల్ డీఈవో డా. గోవిందరాజులు తెలిపారు. ఎస్ఏల ఖాళీల భర్తీ తరువాత వారు ఎస్‌జీటీలో కూడా ఎంపికైతే పేరు తొలగించి ప్రతిభ ఆధారంగా తదుపరి అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నామన్నారు.

ప్రకృతి వనాల నిర్వహణపై పట్టింపేదీ?

ప్రధాన ఇనుప గేటు ధ్వంసమైన ఈ చిత్రం ధన్వాడ మండలం గోటూర్ పల్లె ప్రకృతి వనానికి సంబంధించింది. వనం లోపల సైతం నిర్వహణ లేక పిచ్చిగడ్డి, పొదలు పెరిగాయి. సర్పంచులు ఉన్న సమయాన కొంతైనా బాగుండేది. అధికారుల పాలనలో ఘోరంగా తయారయ్యింది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి.



న్యూస్‌టుడే, నారాయణపేట న్యూటౌన్

గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతిలో భాగంగా ఊరూరా పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో మొత్తం 280 పంచాయతీలు ఉండగా అన్నింటా వీటిని ఏర్పాటు చేశారు. లభ్యమైన చోట మూడు నుంచి అయిదు ఎకరాల ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటగా ప్రసుత్తం ఇవి వనాలుగా మారాయి. కొన్ని చోట్ల దొరికిన మేరకు చిన్నగా వనాలను ఏర్పాటు చేశారు. మొదటి రెండేళ్లు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ విభాగం పర్యవేక్షణ చేయడంతో ఇబ్బంది లేకుండా పోయింది.

ఆ తర్వాత వీటి నిర్వహణ బాధ్యతల్ని పంచాయతీలకు అప్పగించారు. సిబ్బంది కొరత మూలంగా అనుకున్నంత పర్యవేక్షణ చేయకపోయినా అడపాదడపా నిర్వహణ చేసేవారు. నడకదారుల్ని శుభ్రపరుస్తూ పొదల్ని తొలగించేవారు. ప్రత్యేకాధికారుల పాలన వచ్చిన తర్వాత నిర్వహణే లేకుండా పోయింది. దీంతో వనాలు అపరిశుభ్రతకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా తయారయ్యాయి. కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు సైతం మరమ్మతులకు గురయ్యాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో జిమ్ పరికరాలు దొంగలపాలయ్యాయి. మొక్కలు ధ్వంసం అయ్యాయి.

ఈ విషయమై 'న్యూస్‌టుడే' జిల్లా పంచాయతీ అధికారి కృష్ణతో మాట్లాడగా నిర్వహణ పరంగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ప్రత్యేకాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

యువతకు ప్రాధాన్యం: మంత్రి

అలంపూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ప్రాధాన్యం ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం అలంపూర్ హరిత టూరిజంలో విలేకరులతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వకనే నిరుద్యోగ సమస్య పెరిగిందని ఆరోపించారు. తెలంగాణ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పటిష్ఠం చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. వివిధ శాఖల్లో 60 వేల ఉద్యోగాలను 10 నెలల్లో భర్తీ చేశామని మంత్రి పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షలు నిర్వహించామని, మరో రెండు రోజుల్లో ఉద్యోగ నియామక పత్రాలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేస్తామని మంత్రి వివరించారు. యువతలో నైపుణ్యం పెంచేందుకు ప్రతి జిల్లాలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి పురావస్తు శాఖతో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు మంత్రి ఆలయాలను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో రుద్రహోమం, అభిషేకం, జోగులాంబ ఆలయ సన్నిధిలో చండీహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, తదితరులున్నారు.



అమ్మవారి దర్శనానికి వస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు తదితరులు

మంత్రి ఆదేశాలతో కదలిక వచ్చేనా!

ర్యాలంపాడు జలాశయానికి మరమ్మతులు

గద్వాల, న్యూస్‌టుడే: నెట్టంపాడు పథకంలో కీలకమైంది ర్యాలంపాడు జలాశయం. లీకేజీలను అరికట్టి పూర్తిస్థాయిలో నీటినిల్వ (4.20 టీఎంసీల) ఉంచటానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా గట్టు ఎత్తిపోతల పరిశీలనకు వచ్చిన భారీ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం తక్షణం ర్యాలంపాడు మరమ్మతులకు సంబంధించి కార్యచరణ మొదలు పెట్టాలని ఈఎన్‌సీకి ఆదేశాలు ఇచ్చారు. మట్టి కట్ట నుంచి వస్తున్న లీకేజీల సమస్యపై గతంలో ప్రైవేటు సర్వే సంస్థ జియో ఫిజికల్, ఎలక్ట్రో రెసిస్టివిటీ విధానంలో పరీక్షలు చేసి మట్టి నమూనాలను సేకరించి చేయాల్సిన మరమ్మతులపై సంస్థ సాగునీటి శాఖకు నివేదిక ఇచ్చింది. అందుకు రూ. 153 కోట్ల వరకు ఖర్చు కానున్నట్లు సాగునీటి శాఖ ప్రాథమిక అంచనా. ప్రస్తుతం జలాశయంలో 2 టీఎంసీలు మాత్రమే నిల్వ చేస్తుండటంతో జలాశయం పరిధిలోని 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండేళ్లుగా రబీలో పంట విరామం ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది.



రెండు టీఎంసీల నిల్వకే పరిమితమవుతున్న జలాశయం

కర్టెన్ గ్రౌంటింగ్‌కే మొగ్గు: జూరాల జలాశయం మట్టికట్టలో సైతం జలాశయంలో నీటినిల్వ పూర్తిస్థాయిలో చేసిన క్రమంలో 13 ఏళ్ల కిందట సీపేజీలు వచ్చాయి. వాటిని అరికట్టేందుకు మట్టికట్టపై కోర్‌డ్రిల్లింగ్ ప్రక్రియ ద్వారా రంధ్రాలు వేసి గ్రౌంటింగ్ ద్వారా మరమ్మతులు చేపట్టారు. తాజాగా ర్యాలంపాడు జలాశయం మట్టికట్టపై కూడా అదే పద్ధతిలో మరమ్మతులు చేపట్టాలని సాగునీటి శాఖ నిర్ణయించింది. వచ్చే డిసెంబరు నెలలో పనులు మొదలు పెట్టనున్నట్లు ఈఎన్‌సీ మంత్రి పర్యటన సందర్భంగా వెల్లడించారు. అయితే డిసెంబర్‌లో పనులు మొదలు పెట్టాలంటే ఇంకా 60 రోజుల గడువు మాత్రమే ఉంది. ఆర్థిక శాఖ క్లియరెన్స్‌లు, సీవోడీ ద్వారా డిజైన్స్ అప్రూవల్ అయి టెండర్ల ప్రక్రియ చేపట్టి ఒప్పందాలు పూర్తి చేసి పనులు మొదలు పెట్టడానికి కనీసం 50 రోజుల గడువు పడుతుంది. కాబట్టి అధికారులు అక్టోబరు నెలలోనే కార్యాచరణ మొదలు పెడితే కానీ డిసెంబర్‌లో పనులు మొదలయ్యే అవకాశం ఉండదు.

సామర్థ్యం పెంపుపై: గట్టు ఎత్తిపోతల పథకంలో 33 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ పథకం ద్వారానే నీటిని ఎత్తిపోసి సాగునీటిని ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ర్యాలంపాడు జలాశయంలో నీటినిల్వ నాలుగు టీఎంసీలు ఉంటేనే గట్టు పథకానికి ఆయుష్షు ఉంటుంది. లేని పక్షంలో ఆ పథకమే విఫలమయ్యే పరిస్థితి ఉంటుంది. దీనిపై కూడా మంత్రి పర్యటన సందర్భంగా చర్చకు వచ్చింది. 4 టీఎంసీల సామర్థ్యం నుంచి 6 టీఎంసీలకు పెంచాలని స్థానిక నేతలు విజ్ఞప్తి చేశారు. దానిపైనా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఈఎన్‌సీకి సూచించారు. ఇక గుడ్డెందొడ్డి లేదా గట్టు జలాశయాన్నే 15 టీఎంసీల సామర్థ్యం ఉండేలా రూపకల్పన చేయాలన్నది కూడా ప్రభుత్వం మదిలో ఉంది. సామర్థ్యం పెంచి స్టోరేజీ జలాశయాలుగా మార్పులు చేసి అవసరం ఉన్న సమయంలో జూరాలతో పాటు ఉమ్మడి జిల్లాలో ఎత్తిపోతల పథకాలకు రబీలో సాగునీటి కొరతకు శాశ్వత పరిష్కారం చూపాలని కూడా అనుకుంటున్నారు. అయితే వీటన్నింటికి అడుగు ముందుకు పడాలంటే తొలుత డీపీఆర్‌లు వెనువెంటనే ఆర్థిక శాఖ ఆమోదాలు, తదనంతరం ఆక్రుతుల పూర్తి అంచనా వ్యయంతో టెండర్ల ప్రక్రియ జరిగితే తప్ప అనుకున్న లక్ష్యాలు పూర్తి కావు.



స్వాగతం పలుకుతున్న రైల్వే సీనియర్ సిటిజన్లు, రైల్వే అధికారులు

వాస్కోడగామా రైలుకు ఘన స్వాగతం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : సికింద్రాబాద్ - వాస్కోడగామా (గోవా) 07039/40 రైలుకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి జెండా ఊపి ఈ రైలును ప్రారంభించగా మహబూబ్‌నగర్ స్టేషన్‌కు వచ్చింది. స్థానిక సీనియర్ సిటిజన్లు, రైల్వే అధికారులు, ప్రయాణికులు రైలుకు స్వాగతం పలికారు. ఈనెల 9 నుంచి అధికారికంగా రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ - వాస్కోడగామా వైపు నడవనుంది. అలాగే తిరుగు ప్రయాణంలో వాస్కోడగామా - సికింద్రాబాద్ ప్రతి గురు, శనివారాల్లో నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

నేడు బతుకమ్మ సంబరాలు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని బారంబావి రాంలీలా మైదానంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి హాజరవుతారని, పుర కౌన్సిల్ యంత్రాంగం, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ముద్దబంతులు విరిసె.. బతుకమ్మ మురిసె!




బాలానగర్ మండలం గుండేడ్‌లో తోట

దేవరకద్ర మండలం గోప్లాపూర్‌లోని తోటలో నిలబడి చిత్రాలు దిగుతున్న ఓ కుటుంబం


ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలనే దేవతగా పూజించటం బతుకమ్మ పండగ ప్రత్యేకత. పల్లెల్లో బాలికలు నిత్యం వివిధ పూలతో బతుకమ్మలు తయారు చేసి సాయంత్రం వేళ ఆడిపాడుతున్నారు. ఈ పండగ వేళ ఉండే గిరాకీని దృష్టిలో పెట్టుకుని రైతులు ఇప్పటికే బంతి, ఇతర పూలతోటలు సాగు చేశారు. దేవరకద్ర మండలం గోప్లాపూర్, బాలానగర్ మండలం గుండేడ్ గ్రామాల్లోని రైతుల పూలతోటలు ఇలా విరగబూసి అందరికీ కనువిందు చేస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించేవారు బంతితోటలోకి వెళ్లి చరవాణులతో చిత్రాలు దిగుతూ మురిసిపోతున్నారు. కాసేపు అక్కడే సేదతీరుతున్నారు. ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే, జడ్చర్ల గ్రామీణం

మనసు పెడితే.. లక్ష్య ఛేదన సాధ్యమే!



'పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్క రోజులో దేన్నీ సాధించలేం.'
-స్వామీ వివేకానంద



న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: విజయాలు గాలి వాటంగా ఎప్పుడూ రావు. అదేదో సినిమాలో అన్నట్లు వంద కాదు.. రెండు వందల శాతం ప్రయత్నిస్తే ఏనుగు కుంభస్థలాన్నైనా కొట్టొచ్చు. సాధించాలనే తపన, అందుకు తగినట్లుగా శ్రమిస్తే విజయ తీరాలు వెతుక్కుంటూ మీ వద్దకే వస్తాయి. ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్ పరీక్షల్లో తప్పుతున్న వారి సంఖ్య రాష్ట్రంలోనే అధికంగా ఉంటోంది. ఇందుకు మనకు మనమే కారణం కాదా.. బోధనా లోపాలు, వసతులు లేవనే వాదనలు పక్కన పెట్టండి.. మన విజయానికి మనం చేస్తున్న కృషి ఎంత? ఆలోచించండి. అప్పుడే ఇక ఏ రంగంలోకి దిగినా విజయలక్ష్మి మిమ్మల్ని వరించక తప్పదు. అది చదువైనా.. ఉద్యోగమైనా..

● నారాయణపేట జిల్లా కోస్గి పురపాలిక పరిధిలోని గుండ్లపల్లికి చెందిన సంతోష్ కుమార్ ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే అయిదు ఉద్యోగాలు సాధించాడు. నీటి పారుదల శాఖ ఏఈఈ, పాల్‌టెక్నిక్ కళాశాల అధ్యాపకునిగా, పురపాలిక పట్టణ ప్రణాళిక అధికారిగా, పంచాయతీరాజ్ ఏఈతో పాటు, గ్రూప్-4కు ఎంపికయ్యారు.

● మల్దకల్ మండలం ఎల్కూరుకు చెందిన మహ్మద్ సుభాన్ మూడు ఉద్యోగాలు సాధించారు. వేర్వేరు గురుకులాల్లో రెండు అధ్యాపక పోస్టులకు ఎంపికయ్యారు. అలాగే పంచాయతీ కార్యదర్శిగానూ ఉన్నారు.

● కొల్లాపూర్‌లో చుక్కాయిపల్లికి చెందిన స్వప్న ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌ఏ విభాగంలో జిల్లా రెండో ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది.

● సైన్స్ చిత్ర పటాలు బాగా నేర్చుకోవాలి. విద్యార్థులతో కలసి చిత్రాలు వేయడం, సొంతంగా సాధన చేయాలి. ఇష్టమైన, సులభమైన పాఠ్యాంశాలను బాగా నేర్చుకోవాలి.



● సాంఘిక శాస్త్రంలో మ్యాప్‌లను చూడటం, దేశాలు, రాష్ట్రాలను గుర్తిస్తూ నేర్చుకోవడం, చరిత్రను గుర్తించుకునేలా పుస్తకాలు చదవడం.

● గణితంలో ప్రాథమిక భావనలు(కాన్సెప్ట్) బాగా నేర్చుకోవాలి. ప్రతి రోజూ రెండేసి లెక్కలు సాధనచేసినా పరీక్షల నాటికి 500 నేర్చుకోవచ్చు.

● ప్రణాళికా ప్రకారం ఇంగ్లిష్ గ్రామర్ నేర్చుకోవాలి. తోటి స్నేహితులతో చర్చించి లెటర్ రాయడం అలవాటు చేసుకోవాలి. అపరిచిత గద్యభాగంపై సాధన చేయాలి.

● హిందీ వ్యాకరణంపై దృష్టి పెట్టాలి. నేర్చుకోవడం, ఇతర విద్యార్థులతో మాట్లాడుతూ ఉండటం ద్వారా పట్టు సాధించవచ్చు.

● గత పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పాఠ్య పుస్తకం చదవడం అంశాల వారీ ప్రాధాన్యత తెలుసుకోవచ్చు.

● తెలుగులో అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా, వాక్య నిర్మాణం సరిగా ఉండేలా సాధన చేయాలి. చక్కటి దస్తూరీ ప్రధానం.

● ఇతర వ్యాపకాలు తగ్గించి చదువుపైనే దృష్టి పెట్టాలి. సబ్జెక్టు వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

ఇప్పటి నుంచే: తరగతి ఏదైనా విద్యార్థి వారి సామర్థ్యాలకు తగ్గట్లుగా రాణించడం ముఖ్యం. ఉమ్మడి జిల్లాలో గతేడాది పదో తరగతిలో 44,898 మంది పరీక్షలు రాస్తే, 5,575 మంది అనుత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 36 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తే.. 30 శాతానికిపైగా ఫెయిలయ్యారు. వీరు పరీక్ష తప్పడంలో ఇతర కారణాలతో పాటు స్వ తప్పిదాలు ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో రానున్న వార్షిక పరీక్షల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే విద్యార్థులు మనసా వాచా కర్మణా పూర్తి స్థాయిలో దృష్టి సారించాలి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంకా 5 నెలలకు పైగా సమయం ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదవగలిగితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా చేరుకోవచ్చు. జిల్లా ఖ్యాతినీ ఇనుమడింపజేయవచ్చు.



ఇలా చేయాలి

● నిరంతర అభ్యసనం ప్రధానం. దీని ద్వారా అనేక సమస్యలకు సమాధానాలు సొంతంగా తెలుసుకుంటారు.

● ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, వాటిని నేర్చుకొని అమలు చేయాలి.



త్రికరణ శుద్ధితో చదవాలి: కొందరు విద్యార్థులు చేయాల్సింది చేయకపోవడం, అవసరం లేనిది చేస్తుండటంతో వెనుకబడిపోతున్నారు. ఇలా కాకుండా ప్రతి విద్యార్థి ఎందుకు చదవాలి? లక్ష్యం ఏమిటనేది తెలుసుకోవాలి. వారిలో ఎదగాలనే కోరిక ఉండాలి. ప్రతి విద్యార్థికి చదువు చిట్టచివరి లక్ష్యం కావాలి. త్రికరణ శుద్ధితో చదవాలి. అందుకు అనుగుణంగా శ్రమిస్తే రాణించడం పెద్ద కష్టమేమీకాదు. మూలాలపై శ్రద్ధ పెట్టి ముందుకెళితే తప్పకుండా విజయం సాధిస్తారు.

-డా.శ్రీనాథాచారి, వ్యక్తిత్వ వికాస నిపుణులు

సర్పాలన్నీ విషపూరితం కాదు

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : పరిసరాల్లో కన్పించే సర్పాలన్నీ విషపూరితమైనవి కాదని అందులో రెండు మాత్రమే విషపూరితమైనవని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సదాశివయ్య పేర్కొన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని మన్ననూరులో నిర్వహించిన పాముల ప్రదర్శనలో పాములపై అవగాహన కల్పించారు. పాములు పర్యావరణ పరిరక్షణలో పాములది కీలక పాత్ర అన్నారు. పంటలకు చేటు చేసే ఎలుకలు, చిన్న చిన్న జీవులను పాములు తింటాయన్నారు. మన పరిసరాల్లో ముఖ్యంగా 8 రకాల సర్పాలున్నాయని అందులో కట్ల పాము మాత్రమే విషపూరితమైనవన్నారు. పాములను చంపకుండా వదిలేస్తే పొలాల్లోని ఎలుకలు, చిన్న కీటకాలను తిని జీవిస్తాయన్నారు. తమకు ప్రమాదం ఉందని భావించిన సందర్భంలోనే పాములు కాటేస్తాయన్నారు. వాటికి మనం ఏ హానీ తలపెట్టకపోతే అవి మనను ఏమీ చేయవన్నారు. ఈ సందర్భంగా పలు రకాల పాములను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రామమూర్తి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, చిన్నారులు పాల్గొన్నారు.



మన్ననూరులో పాములపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు సదాశివయ్య, ఎఫ్‌డీఓ రామమూర్తి

రూ.2.79 కోట్లతో అలంకరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాతను రూ.2.79 కోట్ల నగదుతో ధనలక్ష్మీగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు స్వచ్ఛందంగా అలంకరణకు నగదును సమర్పించారు. తెల్లవారుజామున ప్రారంభమైన అలంకరణ మధ్యాహ్నం 11.30 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య దంపతులు అష్టోత్తర నామావళి పారాయణం, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు.



ఉమామహేశ్వరం ధర్మకర్తల మండలి నేడు ప్రమాణస్వీకారం

భోగ మహేశ్వరంలో ఏర్పాట్లు ● హాజరు కానున్న మంత్రి కొండా సురేఖ

అచ్చంపేట, న్యూస్‌టుడే: ప్రముఖ శైవ క్షేత్రం ఉమామహేశ్వర ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మంత్రి హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలు దేరి మధ్యాహ్నం 12.50 గంటలకు అచ్చంపేటలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉమామహేశ్వరం చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార సభలో పాల్గొని మాట్లాడనున్నారు. తరువాత అచ్చంపేటకు చేరుకొని మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల సమావేశంలో పాల్గొననున్నారు.



నల్లమల కొండల్లో వెలసిన ఉమామహేశ్వరం ఆలయం

● ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గంలో 14 మంది సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కొండ దిగువన భోగ మహేశ్వరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఛైర్మన్‌గా పులిజాలకు చెందిన బీరం మాధవరెడ్డిని నియమించారు. కొండపైకి రహదారి విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని మంత్రికి కొత్త పాలకవర్గం వినతిపత్రం అందజేయనుంది.

పట్టపగలే.. దొంగాదొంగ..!



వస్త్రాలను చిందర.. వందర వేసిన దృశ్యం(పాత)



న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం

దొంగతనాలు అంటే చిమ్మ చీకట్లో జరిగేవి. ఒకప్పుడు ఏదైనా చోరీ జరిగినప్పుడు ఇది ఏ ముఠాపని అయి ఉంటుందో అన్న కోణంలో పోలీసులు విచారించేవారు. ఇటీవల కాలంలో పట్టపగలు, మిట్ట మధ్యాహ్నం చోరీలు జరగడం పరిపాటిగా మారింది. మామూలు వ్యక్తులుగా సంచరిస్తూ, తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇరుగు,పొరుగు వారికి కూడా అనుమానం రాని రీతిలో తాళాలను కోసేసి గుంభనంగా పని కానిచ్చేస్తున్నారు. పట్టణాల్లో సాంకేతికత అందుబాటులోకి రావడంతో సులువుగా పట్టుబడతామని భావించి తెలివిగా గ్రామాలను అడ్డాగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్నవారి స్థితిగతులను ముందే అధ్యయనం చేస్తున్నారు.

● పల్లెల్లో సీసీ కెమెరాలు వంటి సాంకేతికత అందుబాటులో లేకపోవడం, జనం పనుల నిమిత్తం పొలాలకు వెళ్లడంతో పట్టపగలు వారి పని సులువు అవుతోంది. గతంలో జరిగే దొంగతనాలను చాలా వరకు చరవాణిల ఆధారంగానే కనుగొనేవారు. దొంగలు తెలివిగా చరవాణులను వెంట తీసుకురాకుండా ద్విచక్రవాహనాలపై గ్రామాలకు చేరుకొని తమ పని చేసుకొని ఉడాయిస్తున్నారు. చుట్టాల ఊరికి వచ్చినట్లు కలర్ ఇస్తూ ఎవరికీ అనుమానం రాని రీతిలో సంచరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.




కాచ్‌వార్ గ్రామంలో చోరీకి గురైన ఆభరణాల పెట్టెలు (పాత)

ఏం చేయాలి?

● పట్టపగలు తాళం వేసుకుని వెళ్లకుండా ఇంట్లో ఎవరినైనా ఉంచాలి. తప్పనిసరి వెళ్లాల్సివస్తే ఇరుగు, పొరుగువారిని అప్రమత్తం చేయాలి. ప్రస్తుత రోజుల్లో చరవాణి లేని వ్యక్తి అంటూ ఎవరూ ఉండరు. ఇంట్లో ఏదైనా అలికిడి జరిగేటప్పుడు చరవాణికి సంకేతాలు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి. మార్కెట్‌లో అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

● విలువైన వస్తువులు, బంగారం వంటివి బయటకు వెళ్లేటప్పుడు తెలిసిన వారికి అప్పగించాలి.

● గ్రామంలో అపరిచితులు ఎవరైనా ప్రవేశిస్తే గట్టిగా ప్రశ్నించి నిర్ధారించుకోవాలి.



మచ్చుకు కొన్ని ఘటనలు

● మక్తల్ మండలం కాచ్‌వార్‌లో అశోక్ రెడ్డి ఇల్లు ఊరికి చివరన ఉండటం, తాళం వేసి ఉండటంతో పట్టపగలు చోరీ జరిగింది. కాట్రేవ్‌పల్లి, మంథన్‌గోడ్ గ్రామాల్లోనూ పట్టపగలు చోరీలు జరిగి నగదు, నగలు అపహరణకు గురయ్యాయి. ఊట్కూరు మండలం చిన్నపొర్లలోనూ పట్టపగలు నగదు, డబ్బులు దొంగతనం చేశారు. నారాయణపేట మండలం పెద్దజట్రంలో అదే రీతిలో జరిగింది. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేటలో ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో ఏకంగా ఏటీఎం మిషన్‌ను గ్యాస్‌కట్టర్‌తో ధ్వంసం చేసి నగదు దోపిడీ చేశారు.

● ఇటీవల కోస్గి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు రుణం కట్టేందుకు పేట వచ్చారు. రూ.3లక్షలకు పైగా నగదు ఉన్న బ్యాగును కారులో ఉంచి రోడ్డుపై వాహనం నిలిపి బ్యాంకులోకి వెళ్లాడు. అప్పటికే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారును వెంబడించి అదును చూసి కారు అద్దాలు పగలగొట్టి అపహరించుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. సీసీ కెమెరాలో అంతా రికార్డు అయినా ఇంతవరకు దొంగలు దొరకలేదు.

● నారాయణపేట జిల్లాలో 97, మొత్తం ఉమ్మడి జిల్లాలో 550 వరకు చోరీ ఘటనలు జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగాయి. వాటిని విశ్లేషించినప్పుడు పట్టపగలు దొంగతనాలు ఎక్కువగా జరగడం పోలీసులను నివ్వెరపరుస్తోంది.

జోగులాంబకు ఏపీ ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న కర్నూల్ కలెక్టర్ రంజిత్ బాషా దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కుటుంబ సమేతంగా జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈవో పురేందర్, అర్చకులు, ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం స్వామి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తుల రద్దీ: ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు.



భిన్నంగా నడపాలని..!

నేటితరం చిన్నారులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అధికంగా ఉంటోంది. వినూత్న ప్రయోగాలు చేసి అందరి దృష్టిని ఆకర్షించాలనే తపన వారిలో కనిపిస్తోంది. భూత్పూర్ మండలం ఎల్కిచర్ల గ్రామంలో ఓ బాలుడు తన సైకిల్ చక్రాలకు ఉన్న రెండు టైర్లను తొలగించాడు. కేవలం రిమ్‌లతోనే సైకిల్‌ను తొక్కుతూ ఇలా 'ఈనాడు' కెమెరాకు చిక్కాడు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదు

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదని, దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాలు, రాజ్యాంగాలకు రక్షణ లేదని, ఈ సమస్యలకు రక్షణగా నిలిచి దాని కోసం పోరాటం చేసేది ఒక్క కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సీపీఎం కార్యదర్శి జబ్బార్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభలో మాజీ ఎంపీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, మాజీ ఎంపీ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిలతో కలసి తమ్మినేని వీరభద్రం లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో మూడోసారి మతోన్మాద వ్యక్తుల చేతుల్లో పాలన సాగుతుందని, ఆర్థిక సంపద అంతా అదానీ, అంబానీలకు పంచి పెడుతున్నారన్నారు. రైతు రుణమాఫీలో ఇంకా 18 లక్షల మందికి రూ.17 వేల కోట్లు బ్యాంకులో వేయాల్సి ఉందని, దాని కోసం రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. భాగ్యనగరంలో ఆక్రమించిన చెరువుల కాల్వలను వాటిని పునరుద్ధరించాలన్నా పేరుతో ప్రభుత్వం హైడ్రా పేరిట కూల్చివేతలు ప్రారంభించిందని, దీనిని సీపీఎం పార్టీ వ్యతిరేకించడం లేదని కానీ, పేదల జోలికి వస్తే మాత్రం పూర్తిగా ఖండిస్తామన్నారు. నల్లగొండ జిల్లా వెంట ప్రవహించే మూసి నీటితోనే పొలాలు పండించే పరిస్థితి ఆయా ప్రాంతాల్లో ఉందని వీటి పై దృష్టి పెట్టకుండా సుందరీకరణ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజాహితం కోరుతూ ప్రజల తరఫున పోరాటానికి మనం చేయాల్సిన పని చేయాల్సిందేనని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీపీఐ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, విజయరాములు, అర్జున్, పుట్ట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్వ, న్యూస్‌టుడే : లంకాల గ్రామానికి చెందిన దుప్పల్లి శ్రీనివాసులు, అతని కుమారుడు రాముతో కలిసి ఆదివారం ద్విచక్ర వాహనంపై రాంపూర్ గేటు నుంచి సొంతూరు లంకాల వస్తున్నారు. లంకాల చెరువుకట్ట దాటిన తర్వాత మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని పటాన్‌చెరుకు చెందిన బులేరో వాహనం ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ కిందపడి క్షతగాత్రులయ్యారు. శ్రీనివాసులు(45) తలకు బలమైన గాయాలై రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందారు. రాము కుడికాలుకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమయ్య తెలిపారు.

కారు బోల్తాతో మరొకరు..

ఇటిక్యాల, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పక్కకు కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఎర్రవల్లిచౌరస్తా సమీపంలోని విజయవర్ధిని ఆయిల్ మిల్లు ఎదురుగా అదుపుతప్పి జాతీయ రహదారి పక్కకు బోల్తాపడింది. దీంతో స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్తున్న కర్నూలులోని శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(60) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఆయన ఒక్కరే ఉన్నారు. కర్నూలు జిల్లా పంచలింగాల సమీపంలోని ఆల్కాలిస్ పరిశ్రమలో పనిచేస్తున్నట్లుగా స్థానికులు గుర్తించారు.

రోడ్డు ప్రమాద మృతుడు ఛత్తీస్‌గఢ్ కూలీ

గాయపడిన మరొకరి పరిస్థితి విషమం

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలోని ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన విషయం 'ఈనాడు' పాఠకులకు విదితమే. వారిని ఛత్తీస్‌గఢ్ కూలీలుగా పోలీసులు గుర్తించారు. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ముర్హ(54), కాలురాం రెండు వారాల క్రితం బతుకుదెరువు కోసం జడ్చర్లకు వచ్చారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం సమీపంలోని ఇటుక బట్టీలో కూలీగా పని చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నారు. ఆ ఇద్దరూ కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వచ్చారు. జాతీయ రహదారి-44పై ఫ్లైవర్ మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టింది. ముర్హ అక్కడికక్కడే మృతిచెందగా కాలురాం తీవ్రంగా గాయపడ్డాడు. కాలురాంను హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉంది. ముర్హ కుమారుడు రాంనారాయణ్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836



సమస్య : జీపీకి సంబంధించిన యంత్రం, సౌర పలకల్ని శిథిలావస్థ పాత గ్రామ పంచాయతీ భవనం నుంచి తక్షణమే కొత్త భవనంలోకి తరలించాలి.
- బాలరాజు, ధన్వాడ

సమాధానం : అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రావడం లేదు. మరోసారి ఉన్నతాధికారులతో మాట్లాడించి యంత్రాన్ని, పలకల్ని కొత్త భవనంలోకి మారుస్తాం.
- శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి



సమస్య : మండల వనరుల కేంద్రం ముందు భాగాన ఉన్న నియంత్రిక చుట్టూ చెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు పెరిగాయి. ప్రమాదాలకు ఆస్కారం ఉంది.
- వెంకట్రాములు, ధన్వాడ

సమాధానం : వెంటనే బాగు చేయించి, కంచె ఏర్పాటు చేయిస్తాం.
- ప్రదీప్‌కుమార్, విద్యుత్ ఏఈ

సమస్య : ఇరిగేషన్ పరిధిలో లాల్‌కోట అడ్డు రోడ్డు నుంచి కోయిల్‌సాగర్ వరకు ఉన్న తారురోడ్డును పీఆర్ పరిధిలోకి మార్చి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. రోడ్డు అధ్వానంగా ఉండటంతో బస్సుల రాకపోకలు నిలిచి ఇబ్బంది పడుతున్నాం.
- నర్సింలు, కొండాపూర్

సమాధానం : పంచాయతీరాజ్‌లోకి మార్చాలని కోరుతూ తీర్మానం చేసి పంపాం. ఆ ప్రక్రియ పూర్తయితే నిధులు అడిగి రోడ్డు బాగు చేయిస్తాం.
- సాయి ప్రకాశ్ ఎంపీడీవో, ధన్వాడ

– న్యూస్‌టుడే, ధన్వాడ

తెరపై ఈనాడు

మనోహర్ 70 ఎంఎం : **దేవర.** వెంకటరమణ: **దేవర**
మహేశ్వరి 35 ఎంఎం : **స్వాగ్.** వనయాంబ : **దేవర**
- న్యూస్‌టుడే, నారాయణపేట (పాతబస్టాండ్), కోస్గి గ్రామీణం, మక్తల్ గ్రామీణం

కూరగాయల ధరలు(కిలోకు)



నారాయణపేట (పాతబస్టాండ్) న్యూస్‌టుడే : టమాట రూ.70, వంకాయలు రూ.60, ముళ్ల వంకాయలు రూ60, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.70, బెండకాయలు రూ.50, బీరకాయలు రూ.70, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.40, చిక్కుడు రూ.60, పెద్ద చిక్కుడు రూ.90, గోకరకాయ రూ.70, క్యాప్సికం 70, బీన్స్ 90, క్యాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.60. క్యాబేజి రూ.40, ఉల్లి రూ.70, చింతపండు రూ.120.

రహదారికి మట్టి వేయించండి

నర్వ, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దకడ్మూర్ నుంచి బెక్కరపల్లి వరకు నిర్మించిన కొత్త తారురోడ్డు పనులు పూర్తిచేశారు. కానీ రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయాల్సిన గుత్తేదారులు పనులు చేపట్టలేదు. ఆత్మకూరు, మక్తల్ పట్టణాలకు వెళ్లే ఈ రోడ్డు నిత్యం వందలాది వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందిగా మారుతుందని ఆయా గ్రామాల వాహనచోధకులు వాపోతున్నారు. పనులు పూర్తయి రెండు నెలలు పూర్తవుతున్న మట్టి వేయించేందుకు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అందరి భాగస్వామ్యంతో శతాబ్ది ఉత్సవాలు

ఊట్కూరు, న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్) శతాబ్ది ఉత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలని, ఈనెల 14న నిర్వహించే శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సామాజిక సమరసత వేదిక జిల్లా సమన్వయకర్త డి.నర్సింగప్ప అన్నారు. అంబాభవాని మందిర్ వద్ద ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశంలో ఎక్కడ విపత్తు సంభవించినా నిస్వార్థంగా సేవలు అందిస్తోందని కొనియాడారు. సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఆరెస్సెస్, వీహెచ్‌పీ నాయకులు కేశవరావు, బస్వేష్, బాలాంజనేయులు, రాజేశ్, వై.రాములు, భీంరాజ్, వెంకట్ నారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమరసత వేదిక జిల్లా సమన్వయకర్త డి.నర్సింగప్ప

ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఊట్కూరు, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని సర్దార్‌నగర్, అయోధ్యనగర్, శ్రీకృష్ణనగర్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం నుంచి బతుకమ్మ వేడుకలను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ రాత్రి మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. బతుకమ్మ పాటలకు చిన్నారులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు.



బతుకమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు

రేషన్‌బియ్యం పట్టివేత

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : నారాయణపేట మండలం అభంగపూర్ గ్రామంలో ఆదివారం అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై రాముడు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. కిరాణా దుకాణంలో 14 క్వింటాళ్లు, శేఖర్ ఇంట్లో 2.3 క్వింటాళ్లు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యం స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు

రైతు నేస్తాలు.. ఉత్పత్తిదారుల సంఘాలు

కేంద్రం ఊతమిస్తున్న వేళ మరిన్ని అవసరం

న్యూస్‌టుడే, దామరగిద్ద

ఏ పనైనా సంఘటితంగా చేస్తే సత్ఫలితాలు వస్తాయి. అందుకు ఉదాహరణ జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు. కేంద్ర ప్రభుత్వం వచ్చే అయిదేళ్లలో దేశంలో పది వేల సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి, బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. జిల్లాలో ఇప్పటికే ఆరు సంఘాలు విజయవంతంగా నడుస్తున్న నేపథ్యంలో వాటి స్ఫూర్తితో కొత్తవి ఏర్పాటు చేసుకోవడం అవసరం. పాడితో పాటు అన్ని రకాల పంటలు ఉత్పత్తి చేసే 300 నుంచి 5 వేల మందికి పైగా రైతులు సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రతిరైతు తమ వాటాగా రూ.5 వందల నుంచి 2 వేల వరకు చెల్లించవచ్చు. ఎంత డబ్బు రైతులు జమ చేస్తే నాబార్డు అంత ఇస్తుంది. కర్షకుల్లోనే 10 మందిని డైరెక్టర్లుగా ఎంచుకుంటారు. సీఈవో, అకౌంటెంట్ జీతం, కార్యాలయ నిర్వహణ ఖర్చు ప్రభుత్వం భరిస్తుంది. ఎరువులు విత్తనాలు పురుగుల మందుల విక్రయానికి ప్రభుత్వం లైసెన్స్ మంజూరు చేస్తుంది.



గోదాం నుంచి ఎరువులు తీసుకెళ్తున్న రైతులు

పేట జిల్లాలో ఇలా...

నారాయణపేట జిల్లాలో రెండేళ్ల క్రితం మూడు, ఆ తరువాత మరో 3 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయి. దామరగిద్ద మండల విఠలాపూర్, మక్తల్ మండలం కర్ని, నారాయణపేట మండలం కోటకొండ, మద్దూరు మండలం దోరేపల్లి, కోస్గి మండలం బొల్గారంపల్లి, మండల కేంద్రం నర్వలో ప్రస్తుతం సంఘాలు ఉన్నాయి. దామరగిద్ద రైతు ఉత్పత్తిదారుల సంఘం విఠలాపూర్‌లో కొనసాగుతోంది. ఇందులో మొగలమడక, ఆశన్‌పల్లి గ్రామాలకు చెందిన 420 మంది రైతులు ఉన్నారు. ఇక్కడ ఎరువులు, విత్తనాలు దొరక ధరకు ఇస్తారు. రైతులకు రవాణా ఖర్చులు ఆదా అవ్వడంతోపాటు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు తక్కువ ధరకు లభిస్తాయి. సాధారణంగా ప్రభుత్వ పథకాల్లో రైతులకు 30 నుంచి 50శాతం రాయితీ ఉంటుంది. అదే సంఘాల సభ్యులైతే 75 శాతం రాయితీ లభిస్తుంది. రైస్‌మిల్ ఏర్పాటుకు రూ.3కోట్లు అవసరం ఉంటుంది. సంఘం ద్వారా రూ. కోటికి అయ్యేటట్లు రాయితీపై రైతు సమూహాలకు అందిస్తారు. పంట దిగుబడి వచ్చిన సమయంలో ధర లేకపోతే గోదాంలో నిల్వచేసి, విక్రయించుకునే అవకాశం ఉత్పత్తిదారుల సంఘం కల్పిస్తుంది. ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని రాయితీలు పొందవచ్చు.

మక్తల్‌కు రాత్రి బస్సులు నడపాలి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రం నుంచి ఊట్కూరు మీదుగా రాత్రివేళల్లో బస్సు సర్వీసులు నడిపించాలని ఉద్యోగులు, ప్రయాణికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో సమయానికి రావడం లేదని వాపోతున్నారు. రాత్రి 7గంటల నుంచి అరగంటకు ఒకటి చొప్పున రాత్రి 8.45 గంటలకు బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు. డిపో మేనేజరు లావణ్యను వివరణ కోరగా రాత్రివేళల్లో ప్రయాణికులు, ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా సమయానికి బస్సులు నడిపిస్తామన్నారు.

సురక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : శివాజీనగర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన బాధిత కుటుంబానికి సురక్ష ఫౌండేషన్ ప్రతినిధులు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కుమారుడిని కోల్పోయిన నర్సిములు నిరుపేద కావడంతో తమ వంతుగా ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, మల్లినాథ్, లింగారెడ్డి, వాహిద్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేట: రాజరాజేశ్వరిగా దర్శనమిస్తున్న అంబా భవానీ మాత



ఈశ్వర్‌మందిర్‌లో లలితాదేవిగా అలంకరణ



గాంధీనగర్ తాయమ్మ దేవాలయంలో...



మహంకాళి గుడిలో అన్నపూర్ణదేవిగా..



ధ్రువ్‌పేటలో స్కందమాతగా..



బ్రాహ్మణవాడి చౌడేశ్వరి ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా..



మరికల్: పెద్దచింతకుంటలో..

జగన్మాతా.. శరణు శరణు



ధన్వాడ, న్యూస్‌టుడే : స్థానిక మారుతీనగర్ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారు కాత్యాయనిగా దర్శనమిచ్చారు. బ్రాహ్మణవాడి చౌడేశ్వరీ దేవాలయంలో లలితా త్రిపుర సుందరిగా, అంబాభవానీ మందిర్ ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో స్కంద మాత రూపంలో అలంకరించారు.. అశోక్‌నగర్ మలలాంబికాదేవి ఆలయంలో సిద్ధిదాత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది.

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద అమ్మవారు కాత్యాయినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం ఆలయం వద్ద అమ్మవారిని నెమలి వాహనంపై ఊరేగించారు. నాణేలు, పండ్లు, బెల్లంతో తులాభారం నిర్వహించారు. బ్రాహ్మణవాడలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. శ్రీ నల్లజానమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు, బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండలకేంద్రంలోని ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో భక్తులు ఆదివారం అంబాభవాని మాతను రాజరాజేశ్వరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈశ్వర్ మందిర్ వద్ద అమ్మవారిని లలితా దేవిగా అలంకరించారు.

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : మరికల్ కాళికాదేవి ఆలయంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరీశ్‌కుమార్ సారథ్యంలో నిర్వహించిన పూజల్లో నాయకులు బీమాచారి, కృష్ణయ్య చారి, లక్ష్మీనరసింహాచారి, రామచంద్రాచారి, సూర్యప్రకాశ్, రాజు, శ్రీకాంత్, నారాయణచారి, వీరేశ్‌చారి, సురేశ్‌చారి, మురళిచారి తదితరులు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలోనూ ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు జరిపారు.

దామరగిద్ద, న్యూస్‌టుడే : యానగుంది మాణిక్యగిరి క్షేత్రంలో ఆదివారం నాలుగో రోజు ఉదయం నుంచి రాత్రివరకు లక్ష్మీ వెంకటేశ్వర స్వాముల వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ నిర్వహించారు. భవానీ మాత ఆలయంలో ఘటస్థాపన, అకురార్పణ, నందదీపం, యజ్ఞం, అభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, చండీ పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఊట్కూరు, న్యూస్‌టుడే : బిజ్వార్ అంబాత్రయ క్షేత్రంలో శరన్నవరాత్రి వేడుకలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారిని కూష్మాండా దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శత చండీహోమం, లక్ష తులసి దళార్చన జరిగాయి. భక్తజన సందోహం మధ్య అమ్మవారికి పల్లకీ సేవ చేశారు. భజనలు, దాండియా, గర్బానృత్యంతో ఆ ప్రాంతం మార్మోగింది.



దామరగిద్ద : మాణిక్యగిరిలో భవానీమాత అలంకరణ



దామరగిద్దలో వనదేవత అవతారంలో వాసవి మాత



కాన్‌కుర్తిలో ప్రత్యేక అలంకరణ



అన్నపూర్ణగా దామరగిద్ద గజలేశ్వరి



మక్తల్ బ్రాహ్మణవాడలో సూర్యప్రభ వాహనంపై వేంకటేశ్వర ఉత్సవ మూర్తి



మరికల్‌లోని కాళికాదేవి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...



ఊట్కూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మాణిక్యగిరిలో వెంకన్నను పూజిస్తున్న భక్తులు



ఊట్కూరు: బిజ్వార్ అంబాత్రయ క్షేత్రంలో..



దామరగిద్ద: వాసవిమాత ఆలయంలో కోలాటంతో బతుకమ్మ సంబరాలు

లయన్స్‌క్లబ్ సేవలు మరవలేనివి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : నారాయణపేట లయన్స్‌క్లబ్ సేవలు మరవలేనివని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి, విశ్వజిత్ దంపతులు అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నపిల్లల ఉచిత హృద్రోగ శిబిరం, మెగా హెల్త్ క్యాంపులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యుల సేవలను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను లయన్స్ క్లబ్ సభ్యులు శాలువతో ఘన సన్మానం చేశారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ బట్టడ్, అధ్యక్షుడు రాఘవేంద్ర రెడ్డి, భీమయ్య గౌడ్, లయన్స్ సభ్యులు ఆత్మరాం ఏడ్కే, రవికుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సదాశివారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

ఊట్కూరు, న్యూస్‌టుడే : సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని తాజ్ డక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ సలీం అన్నారు. ఊట్కూరులో ఉచిత కంప్యూటర్ శిక్షణ ముగింపు సందర్భంగా కోర్సు పూర్తి చేసినవారికి ఆదివారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. పేద విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఉద్యోగాల్లో రాణించాలని సూచించారు. సంస్థ కోశాధికారి సయ్యద్ అహ్మద్, విశ్రాంత అధ్యాపకుడు మహ్మద్ గౌస్, పట్టణ శాఖ అధ్యక్షుడు ఖాజీం హుస్సేన్, మసీదు కమిటీ అధ్యక్షుడు మన్సూర్, మక్బుల్, ఖాలిక్, రహీం పాషా, ఉస్నాబాద్ పాషా, మహ్మద్ ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం



నిత్యం ఎన్నో ప్రమాదాలు చూస్తున్నా కొందరు వాహనదారులకు కనువిప్పు కలగడం లేదు. పరిమితికి మించి కూలీలను తీసుకెళ్తు ప్రమాదం అంచున వాహనం నడుపుతున్నారు. ఎల్లంపల్లి, పెద్దకడ్మూర్, నర్వ తదితర గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు పత్తిని తీయడానికి నలభై నుంచి యాభైమంది కూలీలను వాహనంలో తీసుకెళ్తున్నారు. ఆదివారం నర్వలో ఇతర ప్రాంతాలకు చిన్న పిల్లలు, కూలీలకు తీసుకెళ్తున్న దృశ్యమిది. – న్యూస్‌టుడే, నర్వ

తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు సమన్లు

వచ్చేనెల 19న హాజరువాలని సూచన

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమం సకల జనుల సమ్మె నేపథ్యంలో బస్సులను అడ్డుకున్నారన్న అభియోగంతో 28 మంది ఉద్యోగులకు కోర్టు నుంచి సమన్లు అందాయి. మలిదశ ఉద్యమం సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని బస్సులు రోడ్డు మీదకు రాకుండా అడ్డుకున్నారు. అప్పట్లో ఆర్టీసీ టీఎంయూ సంఘం నాయకులు నిర్వహించిన ధర్నాలో ఐకాస ఉమ్మడి జిల్లా సమన్వయకర్తగా ఉన్న చంద్రానాయక్‌తో పాటు మరో 27 మందిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో నలుగురు మహిళా ఉద్యోగినులు కూడా ఉన్నారు. 2024 నవంబర్ 19న రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ద్వారా మహబూబ్‌నగర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుకావాలని సమన్లు అందాయి. 13 ఏళ్ల క్రితం ఉద్యమం సందర్భంగా కేసులు నమోదయ్యాయని, వాటిని కొట్టివేశారని అనుకున్న దశలో కోర్టుకు హాజరుకావాలని సమన్లు వచ్చాయని చంద్రానాయక్ ఆవేదన వ్యక్తంచేశారు.

జాతీయ రహదారిపై నిలిచిన కంటెయినర్

గుడిగండ్ల జాతీయ రహదారిపై రైల్వే వంతెన సమీపంలో కంటెయినర్ కమాన్‌పట్టీలు విరిగి రహదారి మధ్యలో నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

– న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం



సమావేశాలు విజయవంతం చేయండి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో సోమ, మంగళవారాల్లో నిర్వహించబోయే పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. శామీర్‌పేట ఎస్ఎన్ఆర్ పుష్ప హాల్‌లో జరిగే సమావేశాలకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

గింజను కొలిచి.. బోనస్ ఇస్తారట!

కొత్త నిబంధన తేనున్న ప్రభుత్వం?

ధరూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు ఖరీఫ్ సీజన్‌లో క్వింటాల్‌కు రూ.500 వరకు బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా ఈ సీజన్‌లో ఇవ్వాలని నిర్ణయం తీసుకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి తర్వాత స్థానంలో వరి ఉంది. జూరాల ప్రాజెక్టుతో పాటు ఎత్తిపోతల పథకాలు చెరువులు, బోరుబావుల కింద పెద్ద ఎత్తున రైతులు వరి సాగు చేశారు. సాగువిస్తీర్ణం దాదాపు 6.50 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 17లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో 80 శాతానికిపైగా సన్నధాన్యమే ఉంటుంది. దసరా నుంచే కొనుగోళ్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రభుత్వం కొత్త నిబంధన అమల్లోకి తేవటానికి కసరత్తు చేస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

కొలుస్తారట: చిన్నచిన్న వస్తువుల పొడవు, వెడల్పు కొలతలు లెక్కించటం కోసం వినియోగించే కాలిపర్స్ పరికరాన్ని సన్నధాన్యం గుర్తించేందుకు వినియోగించనున్నట్లు సమాచారం. ఇందుకు పౌరసరఫరాల శాఖ సంస్థ ఇప్పటికే భారీ సంఖ్యలో కాలిపర్స్ పరికరాల కొనుగోలుకు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం రెండు చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కొలిచేదిలా: ధాన్యంలో పది గింజలను సేకరిస్తారు. ఒక ప్రత్యేక పరికరంలో వేసి వాటిపై పొట్టుపోయేలా చేస్తారు. తర్వాత వచ్చిన బియ్యపు గింజను కాలిపర్స్ ద్వారా కొలతేస్తారు. ఈ కొలతలో బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్లకన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు మిల్లీమీటరుకు మించొద్దు. బియ్యపు గింజ పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యపు గింజ ఈ కొలతలకు సరిపోతేనే దాన్ని సన్నధాన్యంగా పరిగణిస్తారు. అటువంటి వాటికే రూ.500 బోనస్ చెల్లిస్తారు.

ఎగ్గొంటేదుకేనా: సన్నరకం ధాన్యలేవి అన్నదానిపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. బీపీటీ-5202తో పాటు ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరాం రకాలతో పాటు మరో 33 రకాలను సన్న ధాన్యంగా పరిగణించాలని సూచించింది. అయితే ఈ 37 రకాల్లో మన ఉమ్మడి జిల్లాలో పండించేది ఐదు నుంచి ఆరు రకాలుంటాయి. అలాంటప్పుడు ఈ కొలతలు దేనికని రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ శాఖ సన్నాల కింద ప్రకటించిన జాబితాలో రైతు పండించిన ధాన్యం ఉన్నా కొలతల్లో తేడా వస్తే దొడ్డు కింద పరిగణిస్తే ఎలాగని రైతులంటున్నారు. ఒక్కో వ్యవసాయ క్షేత్రంలో భూసారాన్ని బట్టి గింజ పరిమాణంలో తేడా ఉంటుందని రైతులంటున్నారు. కొలతల పేరుతో కొర్రీలు పెట్టి బోనస్ ఎగ్గొంటేందుకే ఈ కొత్త నిబంధన తెరపైకి వస్తోందని రైతులంటున్నారు.



ధరూరు మండలం సాగైన వరి పంట

పక్కరాష్ట్రంలో రేటెక్కువుంటే: ఇక ఉమ్మడి జిలాలో గద్వాల, నారాయణపేట వనపర్తి జిల్లాలకు సమీపంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు మార్కెట్ ఉంది. గతేడాది రూ.3,300 వరకు క్వింటా సన్నరకం ధాన్యం ధర పలికింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న బోనస్ కలిపినా పక్కరాష్ట్రంలో ఉన్న ధరకన్నా తక్కువే అవుతుంది. ఈ సారీ అదే ధర పలికితే రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే పరిస్థితి ఉండదు.

మార్గదర్శకాలు రాలేదు

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్రాల ఎంపిక పూర్తయింది. కేంద్రానికి వచ్చే ధాన్యం నాణ్యత తదితరాల పరిశీలనకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. వస్తే ఆ ప్రకారమే అమలు చేస్తాం.

-విమల, పౌరసరఫరాల అధికారిణి, జోగులాంబ జిల్లా